

## పోలీస్ స్టేషన్లో డిఎస్పి తనిఖీలు

**నరసాపురం:**వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం డిఎస్పి శ్రీవేద తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించారు. డిఎస్పి కొత్త చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ అమలు చేయాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. అనంతరం మాట్లాడారు. బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్, నరసాపురం రూరల్, మొగల్తూరు ఎస్ఐలు టి.వెంకటసురేష్, జి.వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిటెక్ బెంగ..!



- పూర్తికాని రెండో విడత ఇంజనీరింగ్ సీట్ల కౌన్సెలింగ్
- ఉమ్మడి జిల్లాలో 13 వేల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం
- కౌన్సెలింగ్ పూర్తి కాకుండానే ఫీజు కట్టాలని కాలేజీల ఒత్తిడి
- కౌన్సెలింగ్ పూర్తి కాకుండా, బ్రాంచ్ నిర్ధారణ లేకుండా ఎలాగని తల్లిదండ్రుల ప్రశ్న
- మేనేజ్‌మెంట్ కోటా విద్యార్థులకు తరగతులు ప్రారంభం.. కౌన్సెలింగ్ విద్యార్థులు ఇంటికే పరిమితం
- విద్యార్థుల గురించి ప్రభుత్వానికి పట్టడం లేదని లేదని విమర్శలు వెల్లువ

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఇంటర్ పూర్తి చేసి బిటెక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నెల నాలుగో తేదీన పూర్తి కావాల్సిన రెండో విడత కౌన్సెలింగ్ వివిధ కారణాలతో నిలిచిపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. సమస్యను పరిష్కరించి విద్యార్థులకు కౌన్సెలింగ్ పూర్తి చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 12,900 వరకూ సీట్లు ఉన్నాయి. మేనేజ్‌మెంట్ కోటా 3,870 సీట్లు పోను మిగిలినవి ఎపిఇఎపిసెట్ (ఎంసెట్) పరీక్షల్లో వచ్చే ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తారు. జులై ఏడో తేదీన మొదటి విడత కౌన్సెలింగ్ ప్రారంభమై 19వ తేదీతో ముగిసింది. 23న సీట్ల కేటాయింపు జరిగింది. జులై 28వ తేదీ వరకూ రిపోర్టింగ్‌కు అవకాశం ఇచ్చారు. తర్వాత 30వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్‌కు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తాము కోరుకున్న సీటు రాక, తమకు నచ్చిన కాలేజీ కోసం వేలాది మంది విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొని ఆప్షన్లు పెట్టుకున్నారు. ఆగస్టు నాలుగో తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రభుత్వం చెప్పింది. స్థానికతపై కొంతమంది విద్యార్థులు కోర్టును ఆశ్రయించడంతో రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు నిలిచిపోయింది. దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో 1,248, సిఆర్ఆర్ కాలేజీలో 912, స్వర్ణాంధ్రలో 1200, విష్ణు కాలేజీలో 864, శశిలో 840, వాసవి కాలేజీలో 768, డిఎన్ఆర్‌లో 552 మొత్తం 12,900 సీట్లు వరకూ ఉన్నాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు 70 శాతానికిపైగా ఉన్నారు. కౌన్సెలింగ్ నిలిచిపోవడంతో విద్యార్థులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

**కాలేజీల నుంచి తీవ్ర ఒత్తిడి..**

నిబంధనల ప్రకారం రెండో విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్ పెట్టుకున్న విద్యార్థులు సీట్ల కేటాయింపు జరిగిన తర్వాత కాలేజీల్లో చేరాల్సి ఉంది. కౌన్సెలింగ్‌లో వేరే కాలేజీ పెట్టుకున్నప్పటికీ మొదటివిడతలో సీటు వచ్చిన విద్యార్థులపై ఆయా కళాశాలలు ఒత్తిడి చేస్తున్నాయి. క్లాసులు ప్రారంభిస్తున్నామని, ఫీజులు కట్టాలని చెబుతున్నాయి. కాలేజీ డెవలప్‌మెంట్ ఫీజు, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, ఇతర ఫీజుల కింద ప్రతి కాలేజీ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ఈ సొమ్ము వెంటనే కట్టాలని చెబుతున్నాయి. డేస్కాలర్ విద్యార్థులకైతే బస్సు ఫీజు చెల్లించకపోతే మీకు అవకాశం ఉండదని బెదిరిస్తున్న పరిస్థితి ఉంది. తీరా ఈ కాలేజీలో ఫీజు చెల్లించాక వేరే కాలేజీలో సీటు వస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు మాత్రం సమాధానం ఇవ్వడం లేదు. నాలుగో తేదీ నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని, రెండో విడత కౌన్సెలింగ్ ఇప్పట్లో తేలుతుందో. లేదో తెలియదని, సీటు వచ్చిన కాలేజీలో చేరిపోవాలని ఒత్తిడి చేయడంతో విద్యార్థులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. కొన్ని కాలేజీలైతే ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయంబర్స్‌మెంట్ సొమ్మును సైతం నాలుగు విడతలుగా కాలేజీలకు విద్యార్థులే చెల్లించాలనే నిబంధన పెడుతున్న పరిస్థితి ఉంది. మేనేజ్‌మెంట్ కోటాలో సీటుకు ఈ ఏడాది కాలేజీని బట్టి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు వసూలు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు కౌన్సెలింగ్ ఆలస్యం నేపథ్యంలో విద్యార్థులను ప్రలోభపెట్టి ఫీజులు వసూలు చేయాలని చూస్తున్నారు. విద్యార్థులను ఇంటి వద్ద ఉంచలేక తల్లిదండ్రులు కొంతమంది ఫీజులు కట్టేస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం వెంటనే ఇంజనీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధం కావాలి

## కలెక్టర్ చదలవాడ నాగరాణి



సెల్ఫీ దిగిన కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - భీమవరం**

ఆగస్టు 15న నిర్వహించబోయే జిల్లాస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద బుధవారం కలెక్టర్ నాగరాణి సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు త్రివర్ణ పతాకంతో దిగిన సెల్ఫీలను 'హర్ ఘర్ తిరంగా' వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని, ప్రధాని మోడీ ప్రారంభించిన హర్ ఘర్ తిరంగా ప్రచారం రెండేళ్లుగా జాతీయ ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భీమవరం పోలీసు కవాతు మైదానంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రముఖులు, ప్రజా ప్రతినిధులకు సిటింగ్ ఏర్పాట్లు, ఆహ్వానం, అధికారుల స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించి వివరాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లా సంక్షేమం, అభివృద్ధిని ప్రతిబింబించేలా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో శకటాలు, స్టాళ్ల ప్రదర్శన ఉండాలన్నారు. కార్యక్రమానికి ఎలాంటి అవరోధం కలగకుండా రెయిన్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని, కార్యక్రమంలో పాల్గొనే వారికి స్నాక్స్, తాగునీరందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

**మానవతా సేవలు అభినందనీయం**

ప్రస్తుత తరుణంలో మానవీయతపై ఆలోచన చేసి ఆదరణలో అమలు చేస్తున్న మానవత సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో మానవత రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన శాంతి రథాన్ని కలెక్టర్ నాగరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంబంధాలు తగ్గుతున్న ఈ రోజుల్లో అనాథల మృతదేహాలు, పేదల భౌతికకాయాలు అంతిమయాత్రగా శ్మశానవాటికకు ఉచితంగా తీసుకెళ్లేందుకు ఆలోచన చేసి వాహనాన్ని కూడా ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఆధునిక యుగంలో మానవ సంబంధాలు కొరవడి చనిపోయిన వారిని వాహనాలపై తరలించడం చూస్తూనే ఉన్నామన్నారు. మానవత ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు మాట్లాడుతూ అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించడంతోపాటు, పేదలకు ఉచితంగా శాంతి రథాన్ని పంపడం జరుగుతోందన్నారు. శాంతిరథం అవసరమైనవారు మానవత ఛైర్మన్ 94943 38086, వైస్ ఛైర్మన్ 94901 04401, ఎగ్జిక్యూటివ్ మెంబర్ 92474 62667 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఎడిసి ఎం.నాగేంద్రప్రసాద్, మానవత భీమవరం శాఖ ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, అధ్యక్షుడు రామకృష్ణంరాజు, కో ఛైర్మన్ కారుమూరి నరసింహమూర్తి, కోశాధికారి గ్రంధి కుమార్ వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

# కార్పొరేట్ల చెర నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడాలి

## ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ ఆకుల హరే రామ్

**ప్రజాశక్తి - భీమవరం**

కార్పొరేట్ల చెర నుంచి వ్యవసాయ రంగాన్ని, దేశ సంపదను కాపాడుకోవాలని ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ పిలుపునిచ్చారు. క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని కార్మిక, రైతు, వ్యవసాయ, టియుసిసి, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా గొరగనమూడి రైస్ మిల్లు నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఆర్‌టిసి డిపో, కొత్త బస్టాండ్, పోలీస్ బొమ్మ ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్ నుంచి తిరిగి ప్రకాశం చౌక్ వరకూ ర్యాలీ సాగింది. అనంతరం జరిగిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ నాడు దేశ సంపదను తెల్లవారు దోచుకెళ్లే విధానానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా పిలుపునిస్తే నేడు దేశ ప్రజల సంపదను నల్ల కార్పొరేట్లకు దోచిపెట్టే మోడీ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర పోరాటం చేయాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌ల అమలకు ప్రయత్నించి కార్మిక హక్కులను కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో కార్మిక కర్షక సంఘాల ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు చేసి దేశ సంపదను, హక్కులను కాపాడుకోవాలన్నారు. టియుసిసి జిల్లా నాయకులు దండు శ్రీనివాసరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు మాట్లాడుతూ మోడీ చేతకాని విధానాల వల్ల ఆక్వారంగం కుదేలైందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా మోడీ నోరు విప్పకపోతే ఆక్వా రంగం మరింత దివాలా తీసే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎం.ఆంజనేయులు, బాతిరెడ్డిజార్జి, ఎస్.అత్రియ్య, బోర్రా అలమహారాజు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, బి.నాగు, డి.త్రిమూర్తులు, వేంద్ర సత్యనారాయణ, బి.సుగుణ, కడలి పోతురాజు, బంగారు గణేష్, కె.సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నేతలు

# మహిళల స్వయం సమృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## స్లో బీన్ చాక్లెట్ ఫ్యాక్టరీని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - ఉండి**

మహిళల స్వయం సమృద్ధే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. బుధవారం మహదేవపట్నంలో మహంకాళమ్మ స్వయం సహాయక సంఘానికి ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ పిఎంఎఫ్ఎంఇ పథకం ద్వారా రూ.8.75 లక్షల సబ్సిడీతో మంజూరు చేసిన రూ.25 లక్షల వ్యయంతో నెలకొల్పిన 'స్లో బీన్ చాక్లెట్ ఫ్యాక్టరీని' కనుమూరి రఘురామ కృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కనుమూరి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు కలపకుండా తయారు చేసే చాక్లెట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఎటువంటి రసాయనాలు కలపని నేచురల్ చాక్లెట్లు నేడు ప్రారంభించిన 'స్లో బీన్ చాక్లెట్ ఫ్యాక్టరీ'లో తయారవుతున్నాయన్నారు. ఇటువంటి పరిశ్రమలు నెలకొల్పినట్లయితే కోకో రైతులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఫ్యాక్టరీ నిర్వాహకులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి చాక్లెట్ల తయారీ విధానం, వినియోగించే ముడి సరుకుల గురించి తెలుసుకున్నారు. డిఆర్‌డిఎ పీడీ సిఎం ఎంఎస్ఎస్.వేణుగోపాల్, మహంకాళమ్మ, ఎస్‌హెచ్‌జి గ్రూపు నిర్వాహకురాలు కవురు నవ్యశ్రీ, మండల సమైక్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి శ్రీనివాస్, ఎపి ఎఫ్‌పిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్, ఎపి ఇపిడిసిఎల్ సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.


ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడుతన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

# భారీ వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం


తాడేపల్లిగూడెంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**ప్రజాశక్తి - ఆచంట**

మండలంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు జలమలమయ్యాయి. కాలనీలో రోడ్లు ముంపునకు గురయ్యాయి. పక్కా డ్రెయినేజీలు లేకపోవడం, కచ్చా డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. దీంతో ఆచంట కచేరీ సెంటర్ నుంచి మార్టేరు వెళ్లే ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి జలమయమైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**పెనుమంట్ర:** పగలంతా ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పెట్టిన వాతావరణం సాయంత్రానికి చల్లబడి వర్షం పడింది. దీంతో జనం, రైతులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మొగల్తూరు :** బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరులోని గొల్లగూడెం, పేటపాలెం, ముక్కువారివీధి, వుడయారుపేట, హైస్కూల్ వీధి, అగ్రహారం, పేరుపాలెం, కెపి.పాలెం కాళీపట్నం, పాతపాడు, ముత్యాలపల్లి, వారతిప్ప, మోడీ, రామన్నపాలెం తదితర గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది.

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెంలో సాయంత్రం నాలుగున్నర నుంచి రెండు గంటల పాటు కుండ వర్షం కురిసింది. సాయంకాలం కావడంతో ఉద్యోగులు, విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రధాన రహదారులైన మెయిన్ రోడ్డు, ప్రభాత టాకీస్ రోడ్డు, శేషమహల్ రోడ్డు, పాతురు మసీదు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాలూకాఫీస్ సెంటర్, ఆర్‌టిసి బస్టాండ్‌లో వర్షపు నీరు నిలిచింది. 2గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**పాలకొల్లు :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం నుంచి పాలకొల్లులో ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఉదయం వరకూ వాతావరణం పొడిగా ఉన్న మధ్యాహ్నం నుంచి ఉరుములు మెరుపులతో వర్షం పడింది.

## ఐదు రోజులు భారీ వర్షాలు : కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

**భీమవరం :**జిల్లాలో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం అంతా స్థానికంగానే ఉండాలని, అధికారుల సెలవులు సైతం రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నరసాపురం, మొగల్తూరు, ఆచంట మండలాల్లో అధికారులు ఎక్కువ దృష్టి పెట్టాలని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పైప్‌లైన్లను తనిఖీ చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర మందులు, క్లోరిన్, బ్లీచింగ్ తదితర సామగ్రితో సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08816 299181 ఏర్పాటు చేయడం జరిగిందని, 24/7 విధుల్లో సిబ్బంది ఉంటారన్నారు.

**తాడేపల్లిగూడెం :** భారీ వర్షాల కారణంగా తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి బుధవారం ప్రకటనలో విడుదల చేశారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9493177806, తాడేపల్లిగూడెం టౌన్ ఏరియా, రూరల్ ఏరియా, పెంటపాడు మండలం, గణపవరం మండలం, అత్తిలి మండలం, ఇరగవరం మండలం, తణుకు టౌన్ ఏరియా, తెతలి సెక్షన్ పరిధిలో ఏ విధమైన విద్యుత్ సమస్యలున్నా ఈ నెంబర్లకు తెలియజేయాలని తెలిపారు.


**నరసాపురం :** భారీ వర్షాల కారణంగా నరసాపురం డివిజన్ పరిధిలోని ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ నరసాపురం ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. నరసాపురం, మొగల్తూరు, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, యలమంచిలి పరిధిలో ఏవిధమైన సమస్యలున్నా 94409 02926 తెలపాలని చెప్పారు.

**వేటకు వెళ్లొద్దు : తహశీల్దార్..**

**మొగల్తూరు :** బంగాళాఖాతంలో ఏర్పడిన ప్రభావంతో సముద్రపు అలలు ఉధతంగా ఉంటాయని మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని తహశీల్దార్ కె.రాజుకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం నుంచి తదుపరి ప్రకటన వెలువడే వరకూ ఎవరూ వేటకు వెళ్లకూడదని సూచించారు.

# సొసైటీ ఛైర్మన్ పదవి చాలా కీలకం

## డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు


శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో ఉన్న చిత్రపటంతో సత్కరిస్తున్న సొసైటీ ఛైర్మన్

**ప్రజాశక్తి- ఉండి**

రాజకీయాల్లో రాణించాలంటే సొసైటీ ఛైర్మన్ పదవి చాలా ముఖ్యమని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు అన్నారు. బుధవారం పెదపుల్లేరు విశాల సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కనుమూరి రఘురామ కృష్ణరాజు, మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో రాణించాలంటే సొసైటీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. గతంలో సొసైటీ ఛైర్మన్‌గా పనిచేసిన కలిదిండి రామచంద్రరాజు అనతి కాలంలోనే ఎంఎల్‌ఎ, మంత్రి అయ్యారని గుర్తు చేశారు. కలిదిండి గోపాలకృష్ణరాజు రైతులకు నిస్వార్థ సేవలందించి సొసైటీని అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. కలిదిండి గోపాలకృష్ణంరాజుకు కమిటీ సభ్యులు పాటూరి మోహన్, దేవబోయిన గంగరాజు సహకారం అందించాలన్నారు. అనంతరం సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కలిదిండి గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ పదవిని అప్పగించిన రఘురామ కృష్ణరాజు నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తనపై మరింతగా ఉందని తెలిపారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల వేషధారణలో ఉన్న చిత్రపటాన్ని ఎంఎల్‌ఎకు అందజేసి సత్కరించారు. టిడిపి గ్రామ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ రాజు, కలిదిండి రామకృష్ణంరాజు (శ్రీనుబాబు), టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఉండి డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# దళిత నివాసాల మధ్య.. హైటెన్షన్ విద్యుత్ లైన్ వేయొద్దు : కెవిపిఎస్

**భీమవరం టౌన్ :**దళిత నివాస ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ లైన్ వేయొద్దని లేనిపక్షంలో ఉద్యమిస్తామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు హెచ్చరించారు. పెద్దగరువు గ్రామంలో మూడు రోజుల క్రితం దళిత శ్మశానవాటికలో, దళితుల ఇళ్ల మధ్యలో ప్రమాదభరితంగా ఉండేలా హైటెన్షన్ 32 కెవి విద్యుత్ లైన్ నిర్మించాలని అధికారులు ప్రయత్నిస్తే దళితులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు బుధవారం పెద్ద గరువు దళితపేటలో పర్యటించి విద్యుత్ లైన్ వేసే ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. దళిత పేటలో దళితుల ఇళ్ల మధ్యలో హైఓల్టేజ్ గల 32 కెవి విద్యుత్తు లైన్ వేయాలనుకోవడం అన్యాయమన్నారు. అత్యంత ప్రమాద భరితంగా ఉండే విద్యుత్ లైన్ ప్రజల ఆవాసాల మధ్య ఏ విధంగా వేస్తారని ప్రశ్నించారు. ఆక్వా సాగు చేస్తున్న భూస్వాములకు అనుకూలంగా విద్యుత్ అధికారులు వ్యవహరించడం సరి కాదన్నారు. తక్షణం విద్యుత్ జిల్లా అధికారులు, ఆర్‌డిఒ పర్యటించి విద్యుత్ హైటెన్షన్ లైన్లను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘం నాయకులు ఇంజేటి శ్రీనివాస్, గ్రామ నాయకులు మేడిది చార్లెస్, పాలపర్తి జ్ఞానరాజు, సిహెచ్.రాజారావు, పి. ప్రసాద్, రాజారావు పాల్గొన్నారు.

# నేడు గూడెంలో ఆటోల బంద్

**తాడేపల్లిగూడెం:**కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని, అయితే తమ ఉపాధిని కాపాడి ఆదుకోవాలని బంద్ నిర్వహిస్తున్నామని పట్టణ ఆటో యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం ఆరు గంటల వరకూ ఆటోలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బుధవారం పట్టణంలో ఆటో ప్రచారం నిర్వహించి ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మించాలని సిపిఎం నిరసన

**ప్రజాశక్తి - మొగల్తూరు**

ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని సిపిఎం మండల నాయకులు యడ్ల చిట్టిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అధ్వానంగా ఉన్న రోడ్లను వెంటనే నిర్మించాలని కోరుతూ మొగల్తూరులోని పోలీస్‌స్టేషన్ వద్ద నిలిచిన వర్షపు నీటిలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొగల్తూరు నుండి వెంప వరకూ రహదారిని అభివృద్ధి చేయాలని అన్నారు. మరో రెండు వారాల్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే స్థానికులతో కలిసి ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కొత్తపల్లి నాగరాజు, అడ్డాల ఏడుకొండలు పాల్గొన్నారు.


# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎ అంజిబాబు

### బాధ్యతలు చేపట్టిన మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ సభ్యులు

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, నూతన పాలకవర్గ సభ్యులు రైతులకు అండగా ఉండాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ సభ్యులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎఎంసి ఛైర్మన్‌గా కలిదిండి సుజాత, వైస్ ఛైర్మన్‌గా బండి రమేష్ కుమార్, సభ్యులుగా మైగపుల గంగారాం, చింతా కనకయ్య, రంగోల కృష్ణవేణి, గూడూరి దేవి జ్యోతి, ఎద్దు కాంతామణి, మహ్మద్ ఖలీల్, బండి రాజేష్, మోకా శ్రీను, యాతం నాగలక్ష్మి, నెలపాటి అంబోజి, యర్రంశెట్టి వీర బ్రహ్మం, ఇర్రింకి సుధ రత్నకుమారి, కిల్లంపూడి రమాదేవ బాధ్యతలు చేపట్టారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డు అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలన్నారు. ఎంఎల్ఎ రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేలా నూతన పాలకవర్గ సభ్యులు నిరంతరం కృషి చేయాలన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు మాట్లాడారు. రైతులకు అండగా ఉండాలన్నారు. ఛైర్మన్ సుజాత, వైస్ ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడారు. రైతులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామన్నారు. వారికి ఏ కష్టం వచ్చినా ఎంఎల్ఎ అంజిబాబు, కేంద్ర మంత్రి వర్మ, పొలిట్ బ్యూరో సభ్యురాలు సీతారామలక్ష్మి సహకారంతో తన వంతు సహకారం అందిస్తాం. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.


బాధ్యతలు చేపట్టిన సుజాత

# ఉచిత బస్సు ప్రయాణానికి సర్వం సిద్ధం

## జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి శ్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 15వ తేదీ నుంచి మహిళలు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో వచ్చిన రాష్ట్ర మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లు ఎక్కడికైనా ఉచితంగా బస్సు ప్రయాణం చేయొచ్చని తెలిపారు. జిల్లాలో నాలుగు డిపోలకు గాను ప్రస్తుతం 298 బస్సులు ఉన్నాయని, వాటిలో 184 పల్లె వెలుగు, 19 అల్ట్రా పల్లె వెలుగు 20 ఎక్స్ బస్సులు ఉన్నాయని, మొత్తం 223 బస్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే బస్టాపుల్లో ప్రయాణికులకు కావాల్సిన ఛైర్స్, ఫ్యాన్లు, టాయిలెట్లు వంటివి ఏర్పాటు చేయడం జరిగిందని, ఉచిత బస్సు ప్రారంభించిన తర్వాత ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సు ట్రిప్పులు పెంచుతామని తెలిపారు.

## వెలగలేరు సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

**టిడిపి యువనేత పితాని వెంకట్**


ప్రమాణం చేస్తున్న త్రిసభ్య కమిటీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

వ్యవసాయ పరపతి సంఘాల్లో వెలగలేరు సొసైటీ వెలుగుల కోసం నూతన త్రిసభ్య కమిటీ కృషి చేయాలని ఆచంట నియోజకవర్గ టిడిపి యువనేత పితాని వెంకట్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని వెలగలేరు పిఎసిఎస్ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సొసైటీ భవన ప్రాంగణంలో నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్‌గా బొక్కా నాగేశ్వరరావు, సభ్యులుగా మల్లిడి మీరారెడ్డి, చిర్ల నాగేశ్వరరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మంచి చరిత్ర కలిగిన వెలగలేరు సొసైటీ ప్రగతికి సభ్యుల సహకారంతో కృషి చేస్తానని ఛైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, కార్యదర్శి గూడూరి మురళీమోహన్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కర్రి అచ్యుత్ రామారెడ్డి, చింతపల్లి రామకృష్ణ, నెగ్గిపూడి టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు చిర్ల బాలాజీ రెడ్డి, కట్టా వెంకటరమణ, తేతలి రాజారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు, రైతు సభ్యులు పాల్గొన్నారు.

## బల్లిపాడు సొసైటీ ఛైర్మన్‌గా సత్తిబాబు


సత్తిబాబును అభినందిస్తున్న ఎంఎల్ఎ

**తణుకు(అత్తిలి) :** రైతుల ప్రయోజనాలు కాపాడే విధంగా సొసైటీ అభివృద్ధికి త్రిసభ్య కమిటీ సభ్యులు కృషి చేయాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. అత్తిలి మండలం బల్లిపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ముత్యంశెట్టి సత్తిబాబు, ఇతర డైరెక్టర్లు ప్రగడ శ్రీనివాస్, అరిగెల నగేష్ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ గతం నుంచి గ్రామస్తులు, రైతుల సహకారంతో సొసైటీ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఇదే ఒరవడిని భవిష్యత్తులో కొనసాగించాలని కోరారు. అత్తిలి ఎఎంసి ఛైర్మన్ దాసం ప్రసాద్, అత్తిలి మండల అధ్యక్షుడు కుంచే సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్‌బి చర్ల సొసైటీ అధ్యక్షులుగా వీరాస్వామి


వీరాస్వామికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న గ్రామస్తులు

**నరసాపురం :** మండలంలోని ఎల్‌బిచర్ల సొసైటీ అధ్యక్షులుగా ఉద్దరాజు గుబ్బల వీరాస్వామి బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు సభ్యులుగా చామకూరి ఉషారాణి, పులపర్తి వెంకట సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గం చేత కార్యదర్శి కెవిఎస్.ఎస్.ప్రభ ప్రమాణస్వీకారం చేయించారు. త్రిసభ్య కమిటీకి డెల్టా ప్రాజెక్టు జిల్లా ఉపాధ్యక్షులు గుబ్బల మార్రాజు, సర్పంచ్ గుబ్బల భాను, ఎంపిటిసి పులపర్తి రాంబాబు, కటకంశెట్టి సంజీవరావు, తోట వెంకటేశ్వరరావు అభినందించారు.

## మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా లక్ష్మీగంగాధర్



**నరసాపురం :** నరసాపురం మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా దేశిరెడ్డి లక్ష్మి గంగాధర్ నియామకమయ్యారు. నరసాపురం పట్టణానికి చెందిన గంగాధర్ జనసేన ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా కష్టపడి పనిచేస్తున్నారు. 2024 ఎన్నికల్లో నాయకర్ గెలుపు కోసం ఎంతో కృషిచేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆక్రమణల తొలగింపు పరిశీలన

**ఉండి :** మండలంలోని మహదేవపట్నం గ్రామ మెయిన్ సెంటర్లో ఉన్న ఆక్రమణలను పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. ఆక్రమణల తొలగింపును పరిశీలించిన గ్రామపంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని అన్నారు. మెయిన్ సెంటర్లో దుకాణదారులు ఆక్రమణలు చేసి ముందుకు వేయడం వల్ల డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటుందని, దీనివల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. మెయిన్ సెంటర్‌ను ఆక్రమించడం వల్ల రహదారి ఇరుకుగా మారి వాహన ప్రయాణం ఇబ్బందికరంగా ఉందని, దీనివల్ల స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగింపు చేపట్టడం జరిగిందన్నారు.

## పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

**గణపవరం :** సంవత్సరం లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తల్లులు వేయించాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ కె.ఓంకార్ నాద్ అన్నారు. బుధవారం ఆరోగ్య కేంద్ర పరిధిలో గల స్థానిక మహదేవ అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, మహిళలకు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గణపవరం ఎసిడిపిఒ. ఆర్.బేబిశ్రీలక్ష్మి టీకాలు వేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జయమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎం.యోహాన్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ముందస్తు పిచికారీలు వద్దు

**పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎఒ ప్రసాద్**

**గణపవరం :** రైతులు ముందస్తు పిచికారీలు చేయవద్దని గణపవరం వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. బుధవారం జల్లికొమ్మర, కొమర్రు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం దీనివల్ల విషయంలో ముందస్తుగా పిచికారీ చేయవద్దని సూచించారు. నానో యూరియా నానో డిఎపి వాడటం మంచిదని, అలాగే జీవన ఎరువులు వాడినా మంచి ఫలితాలు పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో రైతులు కుమార్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నా భర్త నాకు కావాలి..

**మరిది పెళ్లి మండపం వద్ద నిరసన తెలిపిన భార్య, కుటుంబ సభ్యులు**

**భీమవరం టౌన్ :** నా భర్త నాకు కావాలంటూ భార్య, వారి కుటుంబ సభ్యులు భీమవరంలో జరుగుతున్న వారి మరిది పెళ్లి కళ్యాణ మండపం వద్ద బుధవారం నిరసన తెలియజేశారు. మండలంలోని తుందుర్రు గ్రామానికి చెందిన ఐండపల్లి నిర్మల పోలిన్, ఉండి మండలం నక్కరాజు గూడెం గ్రామానికి చెందిన ఐండపల్లి రవిరాజులకు 2019లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. మూడేళ్ల నుంచి నిర్మలకు రవిరాజు దూరంగా ఉంటున్నారు, మాకు న్యాయం చేయాలని కోరుతున్నామని నిర్మల తెలిపారు. ఈ క్రమంలో బుధవారం భీమవరం డైలీ కాలనీలోని కళ్యాణ మండపంలో వారి మరిది రవితేజ వివాహం జరుగుతుండగా నిర్మల వారి కుటుంబ సభ్యులు న్యాయం చేయాలంటూ నిరసన తెలియజేశారు. న్యాయం చేయకుంటే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకుని వెళతామని హెచ్చరించారు. దళిత బహుజనదేశ రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ తదితరులు వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వర్రసవ మోషే, పవన్ నరసింహం, ఐండ రాజశేఖర్, మద్దా భాస్కరరావు పాల్గొన్నారు.

## 30న ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

**ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ**

**తణుకు :** ఈనెల 30వ తేదీన ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ముట్టడించాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ తీర్మానించింది. బుధవారం ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం తణుకులో కామన మునిస్వామి అధ్యక్షతన స్థానిక అమరవీరుల భవనంలో జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్ట్ షాపులను తొలగించే వరకు 58 రోజుల సుదీర్ఘ పోరాటం చేయాలని నరసింహమూర్తి పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కెవి పాండు, పొంగు శ్రీనివాసు, కట్టా వెంకటేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, దొంగ సాయిబాబా, కాసాని శ్రీను పాల్గొన్నారు.

## గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి

**నరసాపురం :** మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు ఉల్లంపల్లి కృష్ణమూర్తి హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందారు. తెల్లవారుజామున డ్యూటీ కి వచ్చి ఉదయం 11 గంటల సమయంలో గుండెపోటు రావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కృష్ణమూర్తి చనిపోయినట్లు నిర్ధారించారు. కృష్ణమూర్తి నరసాపురం మున్సిపాలిటీలో 6, 7 వార్డుల్లో 36 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.




# ఎఎంసి కమిటీ కూర్పుపై బిసి నేతల్లో అసంతృప్తి..!

**మండలంలోని టిడిపి శ్రేణుల రహస్య సమావేశం**

**పరిస్థితిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం**

ప్రజాశక్తి - వీరవాసరం

భీమవరం మార్కెట్ యార్డ్ కమిటీ ఎంపికలో తమ సామాజిక తరగతికి సరైన ప్రాధాన్యత ఇవ్వలేదంటూ మండలంలోని శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన టిడిపి నాయకులు అసంతృప్తితో ఉన్నారు. దీనిపై కొందరు ముఖ్యనేతలు, కార్యకర్తలు రహస్యంగా సమావేశమై నియోజకవర్గ నేతలపై చర్చించినట్లు సమాచారం. మండలంలో తమకు ప్రాధాన్యత తగ్గించడంపై టిడిపి రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇటీవల ప్రకటించిన ఎఎంసి పాలకవర్గంలో వీరవాసరం మండలం నుండి తమ సామాజిక తరగతికి రెండు డైరక్టర్ పదవులు కేటాయించనున్నట్లు ప్రచారం సాగించారని చెబుతున్నారు. తీరా కమిటి ప్రకటించాక చూస్తే వీరవాసరం మండలం నుంచి తమ సామాజిక తరగతికి ఒక్క డైరెక్టర్ పదవి కూడా కేటాయించకపోవడంపై టిడిపిలోని శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ మనోవేదనను భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మికి చెప్పుకోవాలనుకున్నా ఆమె వ్యక్తిగత సహాయకులు అడ్డుగోడగా ఉంటున్నారని చెబుతున్నారు. కొన్ని విషయాలను ఆమెతో నేరుగా చెప్పుకోవాలనున్నా, ఎందుకు... ఏమిటీ.. ముందుగా మాకు చెప్పండంటూ పిఎలు అంటున్నారని కొంతమంది టిడిపి నాయకులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పిఎలకు విషయం చెప్పినా సీతారామలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిడిపి వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శుల వల్లే ఈ పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని నేతలు ఆరోపిస్తుండటం గమనార్హం. గత వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన తమ సామాజిక తరగతికి చెందిన వారికి రెండు ఎఎంసి డైరెక్టర్ పదవులు కేటాయించారని, ఇక్కడ ఊరించి ఉసూరుమన్పించారని వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై టిడిపి రాష్ట్ర నాయకత్వం దృష్టికి, అలాగే ఎంఎల్ఎ అంజిబాబు దృష్టికి తీసుకెళ్లాలని నేతలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై టిడిపి అధిష్టానం ఎలా స్పందిస్తుందో, వారి అసంతృప్తిని ఎలా చల్లార్చుతుందో వేచిచూడాలి.


త్రిసభ్య కమిటీని అభినందిస్తున్న టిడిపి నేతలు

## రైతుల అభివృద్ధికి కృషి

**మొగల్తూరు సొసైటీ ఛైర్మన్ తారక రామారావు**

**మొగల్తూరు :** రైతులకు ఎటువంటి సమస్యలు రానివ్వకుండా తాను విధులు నిర్వహిస్తానని పిఎసిఎస్ మొగల్తూరు సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు అన్నారు. మొగల్తూరు పిఎసిఎస్ సొసైటీ కార్యాలయ ఆవరణలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఛైర్మన్‌గా నిప్పులేటి తారక రామారావు, సభ్యులు మైలాబత్తుల రాంబాబు, కవురు నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు, సొసైటీ సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు, కూటమి నాయకులు ముక్కు పుల్లయ్య, గిరి, దూసనపూడి దొరబాబు అభినందనలు తెలిపారు.

## సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

**డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు**


మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు సహకార బ్యాంకు అభివృద్ధికి త్రిసభ్య కమిటీలు కృషిచేయాలని ఎపి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్లకూరు సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కాళ్లకూరు సొసైటీ గత 29 ఏళ్ల పాటు బ్యాంకు రుణాల వసూళ్లలో నూరు శాతం వసూలు చేయడంతో జిల్లాలోనే ఆదర్శ సొసైటీగా ఉంది. ఆడిట్‌లో ఏ గ్రేడ్ తరగతి గత 15 ఏళ్ల నుంచి కొనసాగుతుంది. ఛైర్మన్‌గా దండు ప్రణవ మూర్తిరాజు, సభ్యులుగా తాడి రామకృష్ణ, గండికోట నరసింహమూర్తిలు ప్రమాణం స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, సహకార బ్యాంక్ సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ జి.సత్యనారాయణ, సొసైటీ ఆఫీసర్ కె.వర్ధిని, సొసైటీ సిఇఒ ఇబ్బా శ్రీనివాస్, టిడిపి నాయకులు అరేటి వెంకట రత్న ప్రసాద్, ఆకివీడు డిసి ఛైర్మన్ గోకరాజు శివబాబు, మాజీ సొసైటీ ఛైర్మన్ పివి.రామరాజు పాల్గొన్నారు.

# రైతు సేవలో కోపల్లె సొసైటీ

**రెండోసారి సొసైటీ ఛైర్మన్‌గా నంద్యాల రామరాజు ఎన్నిక**

**నేడు కోపల్లె సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం**



కోపల్లె సొసైటీ

ప్రజాశక్తి - కాళ్ల

సంకల్పం ఉంటే ఎంతో ఉన్నతంగా సహకార సంఘాన్ని తీర్చిదిద్దవచ్చని కోపల్లె సొసైటీ నిరూపించింది. ఈ సంఘం రైతులకు విశిష్ట సేవలందించడంతో పాటు వినూత్న సాంకేతిక ప్రయోగాలకు వేదికగా నిలిచింది. ఈక్రమంలో అనేక హంగులను ఏర్పరచుకుంది. పలువురి ప్రశంసలు అందుకుంది. ప్రతి సంవత్సరం డిసిసిబి నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడంలో కోపల్లె సొసైటీ జిల్లాలోనే ద్వితీయస్థానంలో నిలిచింది. 1956 నుంచి ఇప్పటి వరకు సొసైటీ అధ్యక్ష ఎన్నికలు 12 సార్లు జరిగాయి. జరిగిన అన్ని ఎన్నికలూ ఏకగ్రీవం కావడం మరో విశేషం. కోపల్లె, జక్కరం, పెదఅమిరం నుంచి సొసైటీ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అనవాయితీగా ఉంది. 2019 నుంచి ఇప్పటి వరకు త్రిసభ్య కమిటీల నియమాలు జరుగుతున్నాయి. కోపల్లె సహకార బ్యాంకు వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలందిస్తోంది. ఈ సొసైటీ భవనంలో కార్యకలాపాలు చూస్తే కార్పొరేట్ రీతిన సాగుతున్నాయి. 1956లో 20 మంది సభ్యులతో ప్రారంభమై నేడు 2,333 మంది సభ్యులతో రూ.కోటీ 24 లక్షల షేర్ ధనం కలిగి ఉంది. 11 గ్రామాల్లో కోపల్లె, వేంపాడు, చినఅమిరం, పెదఅమిరం, జక్కరం, సీసలి, బొండాడ, బొండాడపేట, లక్ష్మీనరసింహపురం, ఆనందపురం, మాలవానితిప్ప గ్రామాల రైతులకు, ప్రజలకు సేవలందిస్తోంది. సొసైటీ ద్వారా ఎరువులు, పురుగుమందులు, నిత్యావసర వస్తువులు సొసైటీ పరిధిలో గ్రామాల్లో సరసమైన ధరలకు అందిస్తున్నారు. కోపల్లె, జక్కరం, పెదఅమిరం, బొండాడ, సీసలి గ్రామాల్లో సొంత గోదాముల(గిడ్డంగుల) ద్వారా ఎరువులు, పురుగుమందులు నిల్వ చేసి రైతులకు విక్రయిస్తున్నారు.

**రూ.72 కోట్లతో వార్షిక టర్నోవర్..**

సొసైటీ వార్షిక టర్నోవర్ రూ.72 కోట్లు, సంఘ డిపాజిట్లు రూ.33.87 కోట్లు, డిసిసిబిలో వేసిన డిపాజిట్లు రూ.16.21 కోట్లు, డిసిసిబి నుంచి తీసుకున్న రుణాలు రూ.57 కోట్లు, సంఘ సభ్యులకు ఇచ్చిన రుణాలు రూ.35.44కోట్లు, సంఘం రిజర్వు నిధులు రూ.15.14 కోట్లు, 2024-2025 సంవత్సరంలో సంఘం లాభాలు రూ.కోటీ 23 లక్షలు. ఆడిట్ సొసైటీ ప్రతి సంవత్సరం 'ఏ' గ్రేడ్ పొంది లాభాల బాటలో పయనిస్తోంది. నంద్యాల రామరాజు(హాట్ లైన్స్ బాబు) అధ్యక్షులుగా పని చేసినప్పుడు చేసిన సొసైటీ అభివృద్ధి : 2013-2019 వరకు ఆరు సంవత్సరాలు పాటు సొసైటీ అభివృద్ధికి విశేష కృషిచేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నంద్యాల రామరాజు హయాంలోనే ఏర్పాటు చేశారు. సీసలి, జక్కరం, గోదాముల నిర్మాణం చేశారు. జక్కరం బ్రాంచిలో లాకర్ల సదుపాయం కల్పించారు. సిమెంట్ వ్యాపారాన్ని ప్రారంభించారు. కోపల్లె సంఘ భవనం ఆధునీకరణ పనులు చేశారు. క్యాష్ క్రెడిట్, కౌలు రైతులు, హౌసింగ్ లోన్స్ ఇచ్చారు. కార్యాలయంలో నూతన కౌంటర్ సెంటర్ లైజడ్ ఎసి ఏర్పాటు చేసి, ప్రజలకు, రైతులకు సంఘం ద్వారా సేవలు అందించారు. జక్కరంలో బ్రాంచీ భవనాన్ని బ్యాంకు అభివృద్ధి నిధులు రూ.53 లక్షలతో నిర్మించారు. 2012-13లో బ్యాంకులో డిపాజిట్లు రూ.11 కోట్ల 72 లక్షలు, రుణాలు 21 కోట్ల 16 లక్షలు, రిజర్వులు రూ.4 కోట్ల 80 లక్షలు, లాభాలు రూ. 52 లక్షలకు చేరేందుకు కృషిచేశారు. 2018-2019లో బ్యాంకులో డిపాజిట్లు రూ.21 కోట్ల 11 లక్షలు, రుణాలు రూ.37 కోట్ల 2 లక్షలను రైతులకు రుణాలుగా అందించారు. రిజర్వు నిధులు రూ.11 కోట్ల 79 లక్షలు. లాభాలు రూ.కోటి 51 లక్షల ఆదాయం సొసైటీ ఛైర్మన్ నంద్యాల రామరాజు హయాంలోనే సాధించడం విశేషం. క్యాష్ క్రెడిట్, కౌలు రైతులకు రుణాలు, హౌసింగ్ రుణాలు బ్యాంకు ద్వారా అందించారు.

### సొసైటీని లాభాల్లో నిలపడమే నా లక్ష్యం

**నంద్యాల రామరాజు(హాట్‌లైన్స్ బాబు), కోపల్లె సహకార బ్యాంకు త్రిసభ్య కమిటీ ఛైర్మన్**



కోపల్లె సొసైటీని లాభాల్లో నిలపడమే నా లక్ష్యం. రైతులకు డివిడెంట్ లు, సభ్యుల పెంపుదలకు కృషి చేస్తా. సొసైటీలో పలు రకాల వ్యాపారాలు నిర్వహించి, అన్ని రంగాల్లో సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు ప్రోత్సాహంతో పార్టీలకు అతీతంగా అందరికీ రుణాలు, రైతులకు అందించి సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మాదక ద్రవ్యాలు వినియోగించడం ద్వారా అనర్థాలను కొని తెచ్చు కోవడమేనని స్థానిక ఆర్ఎ జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం లింగం శారద అన్నారు. బుధవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలు గురించి అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు వాడడం ప్రమాదకరమైన వ్యసనమని, వీటి వాడకం వల్ల ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కిడ్నీ, టిబి, కేన్సర్ వంటి ప్రమాదకరమైన జబ్బుల బారిన పడుతున్నారని అన్నారు. మత్తు పదార్థాలు మొదట సరదా కోసం అలవాటు చేసుకుని వాటికి బానిసలు అవుతున్నారని, దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ ఎ.కృష్ణకుమారి, డిప్యూటీ తహశీల్దార్ ఏలియమ్మ, ఎంఇఒ యు.నాగేశ్వరరావు, ఎఎస్ఐ ఎన్.సత్యనారాయణ, సూపర్‌వైజర్ ఎస్.వెంకటలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆచంట :** మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎక్సైజ్ ఎస్ఐ మల్లికార్జున రావు పిలుపునిచ్చారు. నిసాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, కానిస్టేబుల్ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్యామలాంబ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాలకోడేరు :** మాదక ద్రవ్యరహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని పాలకోడేరు ఎస్ఐ మంతిన రవివర్మ అన్నారు. పాలకోడేరు సహకార జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన నషా ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, పార్వతి, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో తాడేపల్లిగూడెం పట్టణ పోలీసుల ఆధ్వర్యాన మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.ఆదిప్రసాద్, ఎస్ఐ పి.నాగరాజు పాల్గొని విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్, కంప్యూటర్ సైన్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ ఎం.నాగేంద్రనాథ్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం, ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ సల్మాన్ భాషా, వివిధ విభాగాధిపతులు, ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు.

**ఆకివీడు :** దేశ భవిష్యత్తు యువతపైన ఆధారపడి ఉందని, యువత మాదక దవ్యాలకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడపలోని వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుంపగడప ఈగిల్(మాదక ద్రవ్యాల నిరోధక) క్లబ్, పోలీసు, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ విభాగం సంయుక్తంగా మాదక ద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ రూపకల్పనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షత వహించారు. ఎక్సైజ్ సిఐ ఎం.శ్రీనివాస్, ఎస్ఐ హెచ్.నాగరాజు, ఐసిడిఎస్ పిఒ వాణి విజయరత్నం మాట్లాడారు.

**గణపవరం:** రాష్ట్రాన్ని మాదకద్రవ్యరహిత రాష్ట్రంగా మార్చడానికి యువత నడుం కట్టాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి అన్నారు. బుధవారం ఐసిడిఎస్ గణపవరం సెక్టార్ ఆధ్వర్యాన నాషా ముక్తి భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక హైస్కూల్లో జరిగిన విద్యార్థుల ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ గణపవరం సెక్టార్ సూపర్‌వైజర్ జెబిబి.విజయలక్ష్మి, ఎంఇఒ జి.బాలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నరసాపురం:** మాదకద్రవ్యాలకు దూరంగా యువత ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం వృద్ధి చెందుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గా భవానీ సూచించారు. మండలంలోని సార్వాలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల వద్ద నిషా ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**వీరవాసరం :** విద్యార్థి దశలో ప్రలోభాలకు గురి కాకూడదని ఎస్ఐ రాజకుమార్ అన్నారు. వీరవాసరం జూనియర్ కాలేజీ, హై స్కూల్‌లో బుధవారం మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడారు. నోడల్ టీచర్ రవి కుమార్, సూపర్‌వైజర్ సరోజిని పాల్గొన్నారు.

**కాళ్ల :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాళ్ల ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. జువ్వలపాలెం హైస్కూల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం బండి రవి శంకర్ మాట్లాడారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.తులసి, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## E.C సర్టిఫికేట్ పోయినది

ఖండవల్లి మావుళ్ళమ్మ, భర్త, వంశీకృష్ణ, డోర్ నెంబర్ 5-104, వేలివెన్ను, ఉండ్రాజవరం మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నేను ది 08-03-2017 లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి P8706580 నెంబర్ పాస్ పోర్ట్ పొంధియున్నాను. అయితే నా పాస్ పోర్ట్ కువైట్ దేశంలో పోగొట్టుకున్నాను. దానితో నేను ఎమెర్జెన్సీ సర్టిఫికెట్ (E.C) మీద ఇండియాకు తిరిగి వచ్చాను.నేను తిరిగి కువైట్ వెళ్ళుటకు ది 20-07-2025న వేలివెన్ను లోని మాఇంటి నుంచి పాలకొల్లు మండలం లంకల కోడేరు బైక్‌పై వస్తుండగా నేను కువైట్ దేశంలో పొందిన నా ఒరిజినల్ E.C. సర్టిఫికెట్ తేది.05-11-2019 (నెంబర్ X0576418) దారిలో పడిపోయింది. ఎంత వెతికిన ఎక్కడ నా EC సర్టిఫికెట్ దొరకలేదు. ఎవరికైన దొరికినపై నా అడ్రస్‌కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 8977868387

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT ELURU**

**A.A.C.F NO: 81/2024**

**Between:-**
M/s. Shriram Chits (India) Pvt.Ltd.,Eluru (formerly known as M/s.Shriram Chits Pvt. Ltd,.. Eluru) **...Petitioner/DHr**

And

Nagireddy. Uma Devi & others **...Respondents/Opponents**

1. NagireddyUmaDevi W/o Gangadhara Rao,Hindu,FeMale, a/a 59years,D.No4-82 Near Datta Asramam Dondapadu Eluru.
2. Nagireddy Gangadhara Rao, S/o Venkateswara Rao, Male, a/a 73years,D.No.4-82 Near Datta Asramam, Dondapadu,Eluru.
3. Nagireddy Gayatri, s/o Gangadhara rao, Female, a/a 25 years, D.No.4-82,Near Datta Asramam Dondapadu, Pedavegi Mandal, Eluru.

పై నంబరు దావాలో అపొనెంట్స్ **OP1 to OP3** అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం **ది.29-08-2025వ** తేదీన వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం **10-30ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని ,ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

**వాయిదా తేదీ.29-08-2025**

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/S శ్రీ రామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

**E.SRINIVASA BABU**
**ADVOCATE,ELURU**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT ELURU**

**A.A.C.F NO: 104/2021**

Between:-
M/s. Shriram Chits (India) Pvt.Ltd.,Eluru (formerly known as M/s. Shriram Chits Pvt.Ltd,.. Eluru) **...Petitioner/DHr**

And

Kondeti Venkata Ramu and others ...Respondents/Opponents

3. Durvasula. Rama Satya Srinivas, S/o Gowriswara Rao, Hindu, Male,a/a 39years, R/o.D.No.22B-3-16,Opp.Ambica Bhavan,Power Peta, Eluru, W.G.Dist. O/oVeterinary Dispensary, Sanivarapu Peat, Eluru,W.G.Dist,
4. Bandadu. Rajarajeswari, D/o RamaRao, Hindu, Female, a/a 47 Years; R/oD.No.6-78, Near Galigopuram,Sanivarapu Peta, Eluru,W.G.Dist. O/o Live Stock Assistant, Rural Live Stock Unit,Bandamcherla, T.Narsapuram Mandal,W.G.Dist.

పై నంబరు దావాలో అపొనెంట్స్ **OP3 to OP4** అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటి రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు మీ హాజరు నిమిత్తం **ది.29-08-2025వ** తేదీన వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం **10-30ని॥లకు** శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు వారు ఎదుట వ్యక్తిగతంగా గాని ,ప్లీడరు ద్వారా గాని హాజరై సంజాయిషీ ఇచ్చుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

**వాయిదా తేదీ.29-08-2025**

(శ్రీ డిప్యూటీ రిజిష్టరర్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ వారి ఉత్తర్వుల ప్రకారం) M/S శ్రీ రామ్ చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, మేనేజర్ అడ్వకేట్ ఫర్ డిస్పూటెంట్

**E.SRINIVASA BABU**
**ADVOCATE,ELURU**


రఘురామకృష్ణరాజును సత్కరిస్తున్న రామాంజనేయులు

## సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

**కాళ్ల సొసైటీ ఛైర్మన్ ఎరుబండి రామాంజనేయులు**

**కాళ్ల :** వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన సహకార సంఘం అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు తెలిపారు. బుధవారం కాళ్ల విశాల సహకార బ్యాంకు ఛైర్మన్, ఛైర్‌పర్సన్ ప్రమాణ స్వీకరోత్సవం కార్యక్రమం డిప్యూటీ స్పీకర్, ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్లుగా కొల్లి శ్రీనివాస్, కె.కనక దుర్గలతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా ప్రజలందరికీ న్యాయం చేయాలని రామాంజనేయులుకు ఈ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు అరేటి వెంకట రత్నప్రసాద్, టిడిపి గ్రామ అధ్యక్షులు పెంటపాటి వెంకట నాగేశ్వరావు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రఘురామకృష్ణరాజు

## సొసైటీలకు మంచి పేరు తీసుకు రావాలి

**డిప్యూటీ స్పీకర్ కనుమూరి రామకృష్ణరాజు**

**పాలకోడేరు :** సొసైటీల ద్వారా రైతులకు విశేషమైన సేవలు అందించి మంచి పేరు తీసుకురావాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శృంగవృక్షం సొసైటీ ఛైర్మన్‌గా కలిదిండి కృష్ణంరాజు(బుజ్జి), కమిటీ సభ్యులుగా కడలి రంగారావు, వీరవల్లి శ్రీనివాస్, విస్సకోడేరు సొసైటీ ఛైర్మన్‌గా నంబూరి వెంకట రామాంజనేయ వర్మ(బాలాజీ రాజు), కమిటీ సభ్యులుగా సంగారెడ్డి విజయలక్ష్మి, బైరెడ్డి శ్రీనులతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ నూతనంగా చేపట్టిన పాలకవర్గాలు గతానికంటే మార్పు చూపించాలని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, పాలకోడేరు సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ కూనది రాజు మురళీకృష్ణంరాజు బాబు, అశోక్, నారాయణరాజు పాల్గొన్నారు.


బాలాజీ రాజును అభినందిస్తున్న అప్పారావు

**ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన**

**మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

**E.A.No.45/2022 in**
**E.P.No.31/2019 in**
**O.S.No.64/2011**

Between:
1.శ్రీమతి కంకిపాటి నరసమ్మ
2.కంకిపాటి రత్నం రాజు ...Petitioners/DHRs
Vs
తప్పెట్ల రామకృష్ణ మరియు 12 మంది వగైరా ...Resondents/JDRs

To.
**ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన అమలు జరగవలసిన రెస్పాండెంట్ పేరు మరియు చిరునామా :**
**12వ రెస్పాండెంట్ :**
తప్పెట్ల కృష్ణ వంశీ, తండ్రి రామకృష్ణ, వయస్సు 22 సం॥లు, స్టూడెంట్, R/o.పాటిమీద, కవిటం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

శ్రీ కోర్టు వారు ది.28-07-2025 సం. తేదీన జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి, E.A.No.45/2022 in E.P.No.31/2019 in O.S.No.64/2011 రులో ఈ పిటీషనులో మీ హాజరుకై వాయిదా ది.**28-08-2025** సం. తేదీ అయినందున, ఈ తేదీన ఉదయం 10.30 గం.లకు మీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పైతెల్పిన కోర్టు వారి యెదుట స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవచ్చును లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథము జరుపబడును.

**చెరుకూరి మురళీధరరావు**
పాలకొల్లు అడ్వకేట్, పాలకొల్లు.
తేది.11-08-2025 సెల్: 9948222515

**ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన**

**మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

**E.A.No.44/2022 in**
**E.P.No.31/2019 in**
**O.S.No.64/2011**

Between:
1.శ్రీమతి కంకిపాటి నరసమ్మ
2.కంకిపాటి రత్నం రాజు ...Petitioners/DHRs
Vs
తప్పెట్ల రామకృష్ణ మరియు 12 మంది వగైరా ...Resondents/JDRs

To.
**ప్రత్యామ్నాయ పిటీషన్ నోటీసు ప్రకటన అమలు జరగవలసిన రెస్పాండెంట్ పేరు మరియు చిరునామా :**
**12వ రెస్పాండెంట్ :**
తప్పెట్ల కృష్ణ వంశీ, తండ్రి రామకృష్ణ, వయస్సు 22 సం॥లు, స్టూడెంట్, R/o.పాటిమీద, కవిటం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.

శ్రీ కోర్టు వారు ది.28-07-2025 సం. తేదీన జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి, E.A.No.44/2022 in E.P.No.31/2019 in O.S.No.64/2011 రులో ఈ పిటీషనులో మీ హాజరుకై వాయిదా ది.**28-08-2025** సం. తేదీ అయినందున, ఈ తేదీన ఉదయం 10.30 గం.లకు మీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పైతెల్పిన కోర్టు వారి యెదుట స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవచ్చును లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథము జరుపబడును.

**చెరుకూరి మురళీధరరావు**
పాలకొల్లు అడ్వకేట్, పాలకొల్లు.
తేది.11-08-2025 సెల్: 9948222515